రుణ మంజూరులో అలసత్వం...

- కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు లభించని భరోసా.
- డీసీసీబీ ద్వారా అందని రుణాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



డీసీసీబీ పూసపాటిరేగ బ్రాంచ్

పూసపాటిరేగ: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ.. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో పాలన సాగించింది. విత్తు నుంచి పంట విక్రయాల వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటామంటూ భరోసా కల్పించి రైతులకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ఐదు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో సుమారు 8,000 మంది రైతులున్నారు. వీరందరికీ పంట రుణాలు అందించేందుకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కనీసం చర్యలు చేపట్టలేదు. 8 వేల మంది రైతులలో కేవలం 10 మంది రైతులకు మాత్రమే రుణాలు ఇచ్చి చేతులు దులుపున్నారు. ఐదు నెలల కాలంలో పది మందికి మాత్రమే రుణాలు ఇవ్వడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో గల పూసపాటిరేగ , వెంపడాం, కుమిలి, లంకలపల్లిపాలెం, పోలిపల్లి, భోగాపురం, డెంకాడ సొసైటీల పరిధిలో గల రైతులకు లక్ష్యానికి మించి రుణాలు అందాయి. 2021 – 22 సంవత్సరంలో రూ. 10.50 కోట్లు, 2022 – 23 సంవత్సరంలో రూ.9.5 కోట్లు, 2023 – 24 సంవత్సరంలో 9 కోట్ల రూపాయలను రుణాలుగా అందించారు. అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మాత్రం పది మంది రైతులకు 10 లక్షల రూపాయలు మాత్రమే రుణాలుగా ఇచ్చింది. రైతులను ఆదుకునేందుకు అటు అధికారులు గాని ఇటు ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం అన్యాయమని పలువురు వాపోతున్నారు. కనీసం రబీ సీజన్‌లో అయినా వ్యవసాయ మదుపులకు డీసీసీబీ ద్వారా రుణాలు అందచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గతంలో విరివిగా రుణాలు

గత ప్రభుత్వంలో రైతులకు విరివిగా రుణాలు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతులందరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం రుణాలు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు.

పి.శంకర్, పూసపాటిరేగ

త్వరలోనే అందిస్తాం..

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే రైతులకు రుణాలు మంజూరు చేస్తాం. నిధుల కొరత ఉండడం వల్ల రుణాలు కొంత మంది రైతులకు మాత్రమే అందించడం జరిగింది. రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు అందేలా చర్యలు చేపడతాం.

కంచన్న, ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్, పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్

క్లుప్తంగా

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన

- ఎంఈఓ విజయ్‌కుమార్



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించే దిశగా బోధన చేపట్టాలని ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థుల సంఖ్య, కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రధానాచార్యులు ఎం. శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

సీతం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రత్యేకంగా బుధవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు సత్యా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, హెచ్అండ్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సీఏఓ కె. సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ కాడెట్లు, తదితరులు పాల్గొన్నారు.

హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన



చీరలను కొనుగోలు చేస్తున్న మహిళలు

విజయనగరం అర్బన్: మహిళా వస్త్ర, అలంకృత ఆభరణాలతో స్థానిక మెసానిక్ టెంపుల్ హాల్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలకు స్పందన లభిస్తోంది. పోచంపల్లి, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల, కాటన్ సిల్క్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, ఖాదీ వస్త్రాలు, అలంకృత ఆభరణాలు ఆకర్షణీయ ధరలతో ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 16న ప్రారంభించిన ఈ ప్రదర్శన వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని ప్రదర్శన నిర్వాహకులు ఎస్.కిశోర్ తెలిపారు.

డైట్‌లో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పగడాలమ్మ

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లా స్థాయి బాల్ రంగ్ సంప్రదాయ నృత్య పోటీలు బుధవారం సందడిగా జరిగాయి. ఈ పోటీల్లో మొయిద విజయరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కర్రసాములో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి ప్రిన్సిపాల్ పగడాలమ్మ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణారావు, ఈశ్వరరావు, రవికుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు



ఆటవస్తువులు అందజేస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. కొండకరకాం అంగన్‌వాడీ కేంద్రానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది టీవీ, వంటపాత్రలు, ఆట వస్తువులు, స్టడీ మెటీరియల్, వాటర్ ఫిల్టర్, బాటిళ్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, నోడల్ అధికారి విజయలక్ష్మి, సీడీపీఓ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ మార్టులతో ఆర్థికాభివృద్ధి

- మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య



మెప్మా అర్బన్ మార్ట్ స్టాల్

విజయనగరం: మహిళల ఆర్థిక అభివృద్ధికి మెప్మా అర్బన్ మార్టులు ఎంతగానో ఉపకరిస్తాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో వివిధ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి మెప్మా మార్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా రెండు రోజుల పాటు అర్బన్ మార్ట్‌లు ఏర్పాటు చేస్తామన్నారున. అక్టోబర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అర్బన్ మార్ట్ ద్వారా 2 లక్షల 45 వేల రూపాయల వ్యాపారం జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

పాముల నియంత్రణకు చర్యలు..



మహిళా పార్కులో పాముల నియంత్రణకు గుళికలు వేస్తున్న సిబ్బంది

విజయనగరం: జిల్లా కేంద్రంలోని మహిళా పార్కులో పాముల నియంత్రణకు ముందస్తు చర్యలలో భాగంగా గుళికలు వేయడం జరుగుతోందని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజుల పాటు పార్కులోకి ప్రవేశాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కార్పొరేషన్ యంత్రాంగం పాముల నియంత్రణకు బుధవారం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కొన్నాళ్లుగా మహిళా పార్కులో పాములు సంచరిస్తున్నట్లు తమ సిబ్బంది గమనించినట్లు తెలిపారు. పాముల వల్ల ప్రమాదం జరగకుండా వాటిని తరలించేందుకు రసాయనాలతో కూడిన గుళికలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ఉమాభరణి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్



బకాయి పన్నుల వసూళ్లలో అసిస్టెంట్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది

విజయనగరం: ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌ల విధింపు, రెన్యువల్‌కు సంబంధించి రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు సిబ్బందితో కలిసి బుధవారం వార్డుల్లో పర్యటించి మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. తక్షణమే పన్నులు చెల్లించాలని ఆదేశించారు. కుళాయి పన్నులు చెల్లించని పక్షంలో తక్షణమే కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఈ నెలలో ఆశాజనకంగానే అన్ని రకాల పన్నులు వసూలయ్యాయని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్. అప్పలనాయుడు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రెండు షాపుల్లో చోరీలకు పాల్పడిన నేరస్తుడ్ని అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్. అప్పలనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, జూలై 15వ తేదీ రాత్రి అంబికా స్వీట్ షాపులో గుర్తు తెలియని దొంగ ప్రవేశించి రూ. 50 వేలు.. అదేవిధంగా నవంబర్ 25వ తేదీ రాత్రి గ్రీన్‌పార్క్ బార్ అండ్ రెస్టారెంట్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి, క్యాష్ కౌంటర్ నుంచి రూ. 12 వేలు దొంగలించినట్లు వచ్చిన ఫిర్యాదులపై వన్‌టౌన్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారన్నారు. విచారణలో ఈ రెండు నేరాలతో సంబంధం ఉన్నట్టుగా గుర్తించిన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన దేవన బుజ్జియ్యను (బుజ్జి) అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబునాయుడు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శివశంకర్, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాకోటి రాములు



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: బీజేపీ ప్రభుత్వం కావాలనే రాజ్యాంగాన్ని, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందని పలువురు ఆరోపించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాకోటి రాములు అధ్యక్షతన బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, విభిన్న వైరుధ్యాలతో కూడిన భారతదేశాన్ని ఇప్పుడున్న పరిస్థితుల్లో ముందుకు నడిపించాలంటే రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, వివిధ సంస్థల ప్రతినిధులు చీకటి దివాకర్, జి. శ్రీనివాసరావు, పి. రమేష్‌రాజు, కరీం , ఎ.వెంకటరావు, షణ్ముకరావు, సీహెచ్ వెంకటేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

డెంకాడ: రైతులు పండిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎ. నాగభూషణం అన్నారు. మండలంలోని పెదతాడివాడ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ట్రక్‌షీట్‌ను రైతులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. వర్ష ప్రభావం కారణంగా రైతులు నూర్పులను వాయిదా వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పి.నిర్మల, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించండి..

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తాన్నే అనిత అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కే డిగ్రీ కళాశాలలో మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు, గృహహింస, సైబర్ క్రైమ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ 1098, 181, 112, 1930 నంబర్లను సంప్రదిస్తే ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వర్రి సన్యాసినాయుడు, కె. సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

విజయనగరం: చెరువుల పరిరక్షణ, పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కోమటి చెరువు, నీలాటి చెరువు, తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. కోమటిచెరువు వద్ద అపరిశుభ్రంగా ఉండడానికి గమనించి సిబ్బందిని మందలించారు. చెరువులలో చెత్తాచెదారాలు వేయకుండా చూడాలని ఆదేశించారు. అలాగే అక్కడ ఉన్న ప్రధాన కాలువ చెత్తలతో నిండి ఉండడాన్ని గమనించి, తక్షణమే కాలువను శుభ్రపరచాలని సూచించారు.

ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తే సహించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని బుధవారం అక్కడ నుంచి తరలించారు. గతంలో ఎన్నిసార్లు తరలించినా మళ్లీ మళ్లీ అక్కడికే వచ్చి వ్యాపారాలు చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసినట్లయితే అపరాధరుసుం విధిస్తామని స్పష్టం చేశారు.

షటిల్ కోర్టు ప్రారంభం

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్‌లో ఉన్న తపాలాశాఖ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. నూతన షటిల్ కోర్టును ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాలాశాఖ హెడ్‌పోస్ట్‌మాస్టర్ డీవీఆర్.శాస్త్రి, పోస్ట్‌మాస్టర్ వి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభినందనలు..



ఈ నెల 22, 23, 24 తేదీల్లో అనంతపురం జిల్లా కొనకొండ్ల, చిత్తూరు జిల్లా అరకొండలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్ 17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో భోగాపురం మండలంలోని తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సురేష్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్. రమణబాబు, ఉపాధ్యాయులు, పీడీ సత్యనారాయణ, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు సిబ్బంది బుధవారం అభినందించారు.

– భోగాపురం

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విజయనగరం మండలంలోని జొన్నవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్. శ్రావణి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. 213 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

భూముల క్రమబద్ధీకరణకు సహకరించండి

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్



అశోక్‌ను కలసిన కూటమి నాయకులు

విజయనగరం రూరల్: సింహాచలం దేవస్థానం పరిధిలోని 420 ఎకరాల్లో ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్న వారికి స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో దేవస్థాన చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు సహకరించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో అశోక్ గజపతిరాజును బీజేపీ శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన శాసనసభ్యుడు పంచకర్ల రమేష్, తదితరులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా 420 ఎకరాల దేవస్థాన భూముల్లో నిర్వాసితులు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని అశోక్‌ను కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతి రాజు, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

భోగాపురం: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న 104 కాంట్రాక్ట్ సిబ్బంది ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం తమకు ప్రతినెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని కోరారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలను చెల్లించాలన్నారు. అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో 104 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు దుమ్ము జగన్మోహన్, ఎం. శ్రీనివాసరావు, ఎస్. రవికిషోర్ రాజు, కె. బంగారప్పుడు, రాంబాబు, పి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



పినవేమలిలో వరికోతల్లో నిమగ్నమైన రైతులు



డెంకాడ: పెదతాడివాడలో పొలం నుంచి వరి పంటను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రైతులు

విజయనగరం రూరల్: తుఫాన్ ప్రభావంతో బుధవారం ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వర్షాలు పడితే వరి పంట పోతుందనే ఉద్దేశంతో కోతలు చేపట్టారు. అలాగే ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు పొలాల్లోనే కుప్పలుగా పెట్టారు. కోరుకొండపాలెం , కోరుకొండ, రాకోడు, జొన్నవలస, ద్వారపూడి, గుంకలాం, చెల్లూరు, మదుకొండిపేట, ముడిదాం, బియ్యాలపేట, కొండకరకాం, దుప్పాడ, చిల్లపేట, పినవేమలి, గొల్లలపేట, చాకలిపేట, సారిక గ్రామాల్లో జోరుగా వరి కోతలు జరుగుతున్నాయి.

కోతలు నిలిపివేయాలి..

పూసపాటిరేగ: ఈనెల 30 వరకు వరి కోతలను నిలిపివేయాలని మండల వ్యవసాయ అధికారి కె. నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు వెంటనే కుప్పలుగా పెట్టుకోవాలని సూచించారు. వరి కుప్పలపై వేయడానికి టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

డెంకాడ: వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోసిన వరిపంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని పెదతాడివాడ గ్రామంలో కోసిన వరి పంటను కళ్లాలకు తరలించడాన్ని ఆమె పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా విజయనగరం



విజయనగరం ఫోర్ట్: ప్రతిజ్ఞ చేస్తున్న అప్పారావు, తదితరులు



డెంకాడ : మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: విజయనగరాన్ని బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అన్ని వర్గాల ప్రజలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు నెలకొంటాయన్నారు. ప్రసవ సమయంలో మహిళలు ఇబ్బంది పడతారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సీడీపీఓ ప్రసన్న, యూత్ క్లబ్ బెజ్జిపురం ఎన్జీఓ డైరెక్టర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం ..

డెంకాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది, డెంకాడ జూనియర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు.